# బలగం BALAGAM TV

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 12 జనవరి 2025 | www.balagamtv.com | పేజీలు 5


## ప్రభుత్వానికి సింగరేణి డెవిడెండ్ రూ.88.55 కోట్లు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

2023-24 ఆర్థిక సంవత్సరానికి గానూ రాష్ట్ర ప్రభుత్వానికి సింగరేణి కాలరీస్ రూ.88.55 కోట్ల డివిడెండ్‌ను చెల్లించింది. సింగరేణి సీఎండీ ఎన్.బలరాం డివిడెండ్ చెక్కును రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు అందజేశారు. సింగరేణి కాలరీస్ చెల్లింపు మూల ధనం (పెయిడ్ అప్ ఈక్విటీ షేర్ క్యాపిటల్)లో 10 శాతాన్ని డివిడెంట్‌గా చెల్లించాలని ఇటీవల ఆ సంస్థ నిర్ణయించింది. ఈ మొత్తం సుమారు రూ.173కోట్లు కాగా.. సింగరేణిలో 51 శాతం వాటా కలిగిన రాష్ట్ర ప్రభుత్వానికి ఇందులో నుంచి 88.55 కోట్ల రూపాయలను డివిడెండ్ చెల్లించింది.

సింగరేణి సంస్థ దక్షిణ భారత దేశ ఇంధన అవసరాలు తీర్చుతూ లాభాలను ఆర్జిస్తూ కార్మికులకు లాభాల వాటా చెల్లించడమే కాకుండా ఏటా రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వా నికి డివిడెండ్‌లు చెల్లించడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇంధన శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ ఆఫీస్‌పై దాడి

- భువనగిరిలో దాడికి పాల్పడిన యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు
- సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆగ్రహం
- పోలీస్ స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ కార్యకర్తల నిరసన

**బలగం టీవీ, భువనగిరి**

భువనగిరి బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్‌పై యువజన కాంగ్రెస్, ఎన్ఎస్ యూఐ నాయకులు దాడికి పాల్పడ్డారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణా రెడ్డి శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూ నాయకులు గుంపుగా వచ్చి పార్టీ కార్యాలయంపై దాడి చేశారు. ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. అంతటితో ఆగకుండా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై సైతం దాడికి యత్నించారు. కాంగ్రెస్ కార్యకర్తల దాడిని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. రేవంత్‌రెడ్డి పాలనపై విమర్శలను తట్టుకోలేకనే కాంగ్రెస్ నాయకులు దాడికి తెగబడ్డారని తెలిపింది.

వివరాల్లోకెళ్తే.. శనివారం జిల్లా కేంద్రంలో విలేకర్ల సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ "సీఎం రేవంత్‌రెడ్డి పథకాలు అమలు చేయకుండా, కక్ష సాధింపు రాజకీయాలు చేస్తున్నారని, పరిపాలన చేతకాని సీఎం "రండ.." అంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ కార్యా లయం ఎదుట బైటాయించారు. ఈ క్రమంలో అక్కడికి చేరుకున్న బీఆర్ఎస్ నాయకులకు వీరికి మాటామాటా పెరిగింది. అనంతరం కార్యాలయంలోని ఫర్నీచర్‌ను కాంగ్రెస్ నాయకులు ధ్వంసం చేశారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొది సేపటికే వారిని విడుదల చేయడంపై మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో మాట్లాడే హక్కు లేదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి పేగులు మెడలో వేసుకుంటా అని, ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతారు కానీ, ప్రజల పక్షాన హామీలు అమలు చేయాలని అడిగితే దాడులు చేస్తారా అని ప్రశ్నించారు. భువనగిరి నియోజకవర్గంలో భూకబ్జాదారులు, రౌడీలు, గూండాలు రాజ్యమేలుతున్నారని, ఈ విషయంపై డీసీపీ స్థాయిలో రివ్యూ నిర్వహించి శాంతిభద్రతలను కాపాడాలని పోలీసులకు సూచించారు. ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసును ముట్టడించేందుకు బీఆర్ఎస్ శ్రేణులు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దాంతో పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. అనంతరం యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రిన్స్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి చిత్రపటాన్ని దహనం చేశారు. ప్రభుత్వం డౌన్‌డౌన్, సీఎం రేవంత్‌రెడ్డి డౌన్‌డౌన్, కాంగ్రెస్ గూండాలు, రౌడీలు ఖబడ్దార్ అంటూ నినాదాలు చేశారు.

### అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ వ్యవస్థ ఏర్పాటుపై

# అధ్యయనం చేయాలి

- హైదరాబాద్ ఓఆర్ఆర్ లోపల పూర్తిగా అండర్ గ్రౌండ్ కేబుల్ విధానాన్ని తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలి
- విదేశాల్లో అధ్యయనం చేయండి
- వచ్చే వేసవిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి
- విద్యుత్‌శాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
- తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ ఆవిష్కరణ



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

గ్రేటర్ హైదరాబాద్ నగరంలో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ వ్యవస్థ ఏర్పాటుపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి వివిధ దేశాల్లో అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను పరిశీలించి నివేదిక అందించాలని ఆదేశించారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ లోపల పూర్తిగా అండర్ గ్రౌండ్ కేబుల్ విధానాన్ని తీసుకురావడానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. విద్యుత్ కేబుల్స్‌తో పాటు ఇతరత్రా వివిధ రకాల కేబుల్స్ కూడా అండర్ గ్రౌండ్‌లోనే ఉండేలా వివిధ ప్రత్యామ్నాయాలు పరిశీలించాలని చెప్పారు.అండర్ గ్రౌండ్ కేబుల్ విధానం ద్వారా విద్యుత్ నష్టాలను తగ్గించడంతో పాటు చౌర్యం అరికట్టడమే కాకుండా, ప్రకృతి వైపరీత్యాల వల్ల విద్యుత్ అంతరాయం వంటి సమస్యలను అధిగమించవచ్చని ముఖ్యమంత్రి వివరించారు. ఇంటిగ్రేడెట్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025 ని ముఖ్యమంత్రి , ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆవిష్కరించారు. అనంతరం పాలసీపై ఉన్నతాధికారులతో సమీక్షించారు.

వచ్చే వేసవిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా పక్కా ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రిగారు ఆదేశించారు. రాష్ట్రంలో గత ఏడాది మార్చిలో పీక్ డిమాండ్ 15,623 మెగా వాట్లకు చేరిందని, ఈ సారి 16,877 మెగావాట్లకు చేరుతుందని అంచనా వేసినట్లు అధికారులు వివరించగా, గరిష్ఠ విద్యుత్ డిమాండ్ అంచనాకు అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు. వ్యవసాయానికి, గృహ అవసరాలకు మార్చి నెలలో పీక్ విద్యుత్ డిమాండ్ ఉంటుందని, దానికి అనుగుణంగా విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని ఆదేశించారు.ఆదివాసీ గూడేలలో గృహాలకు సోలార్ విద్యుత్, సోలార్ పంపుసెట్లు ఉచితంగా అందించేందుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. అటవీశాఖ, గిరిజన సంక్షేమ శాఖతోపాటు సంబంధిత శాఖలతో సమావేశమై వీలైనంత త్వరగా పూర్తిస్థాయి నివేదికను రూపొందించాలన్నారు.

పభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ భవనాలపై సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు వెంటనే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్లాంట్ల ఏర్పాటుకు ఆసక్తి చూపే కంపెనీలను ఆహ్వానించి ఏ విధానంలో వారికి పనులను అప్పగించాలనే ప్రణాళిక తయారు చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు గారు, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు గారు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి గారితో పాటు ఆర్థిక, విద్యుత్, ఇంధన శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణలో గూండా రాజ్యం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ గూండాల దాడిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్ష పార్టీల కార్యాలయాలపైన దాడులు చేయడం కాంగ్రెస్ పార్టీ అలవాటుగా మారిందని ఆయన విమర్శించారు. ఇందిర రాజ్యం పేరుతో అధికారంలోకి వచ్చి తెలంగాణలో గూండా రాజ్యం చలాయిస్తున్నారని మండిపడ్డారు. యాదాద్రి భువనగిరి జిల్లా పార్టీ అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక, కాంగ్రెస్ పార్టీ గూండాలను పంపి దాడులు చేయించడం అత్యంత హేయమైన చర్య అని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలపై, నాయకులపై, పార్టీ కార్యాలయాలపై దాడులు చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. పదేళ్లపాటు ప్రశాంతంగా కొనసాగిన తెలంగాణ రాష్ట్రం, అరాచకాలకు చిరునామాగా మారిందని విమర్శిం చారు. దాడులు, గూండాగిరి తమ మార్కు పాలన అని కాంగ్రెస్ పార్టీ మరోసారి నిరూపించుకుంటుందని అన్నారు..

బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల జోలికి, కార్యాలయాల జోలికి వస్తే తగిన గుణపాఠం చెబుతామని కేటీఆర్ హెచ్చరించారు. వెంటనే బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ గూండాలతో పాటు, వారి వెనుక ఉన్న నలగొండ జిల్లా కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

### మద్యం సరఫరా కంపెనీల ఎంపికలో

# పారదర్శకంగా విధానం పాటించాలి



- ఇతర రాష్ట్రాల్లో బీర్ల ధరలు పరిశీలించాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఎక్సైజ్ శాఖ అధికారులతో రేవంత్ రెడ్డి సమావేశం
- యూబీఎల్ బీర్ల ధరల పెంపు కోసం ఒత్తిడి చేసిందన్న అధికారులు
- కంపెనీల ఒత్తిడికి తలొగ్గేది లేదని రేవంత్ రెడ్డి స్పష్టీకరణ
- హైకోర్ట్ రిటైర్డ్ జడ్జి నేతృత్వంలోని కమిటీ నివేదిక ఆధారంగా ధరల పెంపుపై నిర్ణమన్న సీఎం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో మద్యం సరఫరా చేసేందుకు ముందుకొచ్చే కంపెనీలను ఎంపిక చేసేందుకు పారదర్శక విధానం పాటించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కొత్త కంపెనీల నుంచి దరఖాస్తులను తీసుకునేందుకు నోటిఫికేషన్ జారీ చేసి, కనీసం నెల రోజుల నిర్ణీత గడువు ఇవ్వాలని ముఖ్యమంత్రి చెప్పారు. కొత్త కంపెనీలను అనుమతించే విషయంలో నిబంధనలకు అనుగుణంగా ఉండాలని అన్నారు. ఎక్సైజ్ శాఖకు సంబంధించి ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క గారు, ఆ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గారితో కలిసి సమీక్షించారు.

ఇప్పటికే తెలంగాణ బివరేజస్ కార్పొరేషన్ (కు సరఫరా చేస్తున్న కంపెనీలు కొత్త బ్రాండ్లు సరఫరా చేసేందుకు సులభతర వాణిజ్య విధానం అనుసరించాలని ఈ సందర్భంగా సీఎం చెప్పారు. ఆయా కంపెనీలు తమ బ్రాండ్ల పేర్లతో దరఖాస్తు చేసుకోవాలని, కంపెనీల నాణ్యత ప్రమాణాలు, సరఫరా సామర్థ్యం పరిశీలించి పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ జరగాలని చెప్పారు.


ఇటీవల యునైటెడ్ బేవరేజస్ కంపెనీ బీర్ల రేట్లను 33.1 శాతం పెంచాలని ఒత్తిడి చేసిన విషయాన్ని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కంపెనీల ఒత్తిడికి తలొగ్గేది లేదని, పొరుగున ఉన్న ఏపీ, మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉన్న బీర్ల ధరలను పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు.

హైకోర్ట్ రిటైర్డ్ జడ్జి నేతృత్వంలోని ధరల నిర్ణయ కమిటీ (ప్రైస్ ఫిక్సేషన్ కమిటీ) నివేదిక ఆధారంగా ధరల పెంపుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు.

ఏడాదిగా ఎక్సైజ్ శాఖ ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తుండగా, గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను క్రమంగా క్లియర్ చేయాలని ముఖ్యమంత్రి గారు ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి గారితో పాటు ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో అశాంతి, అలజడి

- ఎమ్మెల్యే హరీశ్‌రావు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**


ఎమ్మెల్యే హరీశ్‌రావు యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో విమర్శలు, ప్రతివిమర్శలు సహజమని హరీశ్‌రావు తెలిపారు. కానీ కాంగ్రెస్ వచ్చాక దాడుల విష సంస్కృతిని ప్రోత్సహిస్తున్నదని విమర్శించారు. యథా రాజ తథా ప్రజా అన్నట్లుగా కాంగ్రెస్ పార్టీ తీరు ఉందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలతో దాడులు చేస్తే, ఆ పార్టీకి చెందిన నాయకులు భౌతిక దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇదేనా మీ సోకాల్డ్ ఇందిరమ్మ రాజ్యం? ఇదేనా మీ సోకాల్డ్ ప్రజా పాలన అని ప్రశ్నించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఇలాగే దాడులు జరిగి ఉంటే మీకు అడ్డగోలుగా మాట్లాడే పరిస్థితులు ఉండేవా అని కాంగ్రెస్ నాయకులపై హరీశ్‌రావు మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీపైన గోబెల్స్ ప్రచారం చేసే అవకాశం ఉండేదా అని నిలదీశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో, ఏడాది కాంగ్రెస్ పాలనలో అశాంతి, అలజడి నెలకొన్నదని అన్నారు. దాడి చేసిన వారిని గుర్తించి, తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు పునరావృతమైతే చూస్తూ ఊరుకునేది లేదని.. తగిన రీతిలో

## పరేడ్ మైదానంలో కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్

- మంత్రి జూపల్లి కృష్ణారావు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో మూడు రోజుల పాటు కైట్ ఫెస్టివల్ జరగనుంది. ఈ మేరకు జనవరి 13 నుంచి 15 వరకు కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఫెస్టివల్ పోస్టర్‌ను మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వివిధ రాష్ట్రాలకు చెందినవారు ఈ ఫెస్టివల్‌లో పాల్గొంటారని, ఇండోనేషియా, శ్రీలంక, నేపాల్, స్కాట్‌లాండ్, మలేషియా, ఇటలీ, దక్షిణాఫ్రికా, నెదర్లాండ్స్ సహా మొత్తం 50 దేశాలకు చెందిన దాదాపు 150 మంది ఫ్లయర్స్ కైట్ ఫెస్టివల్‌లో పాల్గొంటారని తెలిపారు. కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ నిర్వహించే మూడ్రోజుల పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఇందులో ఎవరైనా పాల్గొనవచ్చన్నారు. సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఫెస్టివెల్ ఉంటుందన్నారు.



మన సంస్కృతిలో భాగమే ఈ పండుగలన్నారు. గ్రామాల్లో కూడా సంస్కృతి, సంప్రదాయాలు పెంపొందించేలా పెద్ద ఎత్తున ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్రాచీన కట్టడాలను, దేవాలయాలను పరిరక్షించాల్సి ఉందన్నారు. తెలంగాణ టూరిజం అందుకు తోడ్పాటును అందిస్తుందన్నారు.



సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్తున్న ప్రయాణికులతో హైదరాబాద్‌లోని ప్రయాణ ప్రాంగణాలు కిటకిటలాడుతున్నాయి. ఎంజీబీఎస్, జేబీఎస్ తోపాటు కూకట్‌పల్లి, ఆరాంఘర్, దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్, ఎల్బీనగర్ కూడలి, వనస్థలిపురం, హయత్‌నగర్ వద్ద వాహనాల రద్దీ నెలకొంది. ప్రధానంగా ఏపీకి వెళ్లే రోడ్లపై రద్దీ కనిపిస్తున్నది. హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారిపై వాహనాల రద్దీ నెలకొంది.


బలగం టీవీ, హైదరాబాద్

## కొండపోచమ్మ సాగర్‌లో మునిగి ఐదుగురు మృతి


**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సిద్దిపేట జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. కొండపోచమ్మ సాగర్ డ్యాంలో ఈత కోసం వెళ్లిన ఐదుగురు యువకులు మృతి చెందారు. మొత్తం ఏడుగురు యువకులు డ్యాంలో దిగగా..ఐదుగురు గల్లంతయ్యారు. ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. ఐదుగురి మృతదేహాలను పోలీసులు బయటకు తీశారు. మృతులు హైదరాబాద్ లోని ముషీరాబాద్ కు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌కు చెందిన ఏడుగురు యువకులు.. గైరా ధనుష్ (18), గైరా లోహిత్(17) అన్నదమ్ములు, దినేశ్వర్ (17), సాహేల్ దిఫక్ సుతార్ (19), ఉప్పల జతీన్ (17), కొమారి మృగాంక్ ఎండీ ఇబ్రహీం శనివారం ఉదయం 8:30 గంటలకు సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్నను దర్శించుకొని వస్తామని ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పి బయలు దేరారు. మార్గమధ్యలో తూంకుంట వద్ద తొమ్మిదిన్నరకు టిఫిన్ చేసి మర్కుక్‌లోని కొండపోచమ్మ సాగర్ వద్దకు చేరుకొని ఈత కొట్టేందుకు ఏడుగురు నీటిలోకి దిగారు. ఈ క్రమంలో సెల్ఫీలు దిగుతుండగా ఐదుగురు ప్రమాదవశాత్తు నీటిలో గల్లంతయ్యారు. వారిలో గైరా ధనుష్, గైరా లోహిత్, దినేశ్వర్, సాహేల్ దిఫక్ సుతార్, ఉప్పల జతీన్ మృతిచెందారు. ప్రమాదం నుంచి బయటపడ్డ మృగాంక్, ఎండీ ఇబ్రహీం..



సాగర్ పరిసర ప్రాంతంలో ఉన్న రైతులకు సమాచారం చేరవేశారు. వారు వచ్చేసరికి ఐదుగురు నీట మునిగారు. దాంతో పోలీసులకు సమాచారం అందజేశారు. సిద్దిపేట సీపీ అనురాధ, గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి, గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్లను రప్పించి యువకుల కోసం గాలింపుచర్యలు చేపట్టారు. 7 గంటల పాటు శ్రమించి ఐదు మృతదేహాలను బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, ఘటన విషయం తెలుసుకున్న సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, గజ్వేల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి.. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహాలను బయటకు తీసేవరకు అక్కడే ఉండి పర్యవేక్షించారు.



## అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ వార్షికోత్సవాలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యంలో రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠాపన మొదటి వార్షికోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం ప్రారంభమైన ఉత్సవాలు ఈనెల 13 వరకు జరగనున్నాయి. హిందూ క్యాలెండర్ ప్రకారం గత ఏడాది అంటే 2024 లో పుష్యమాస శుక్లపక్ష ద్వాదశి జనవరి 22న వచ్చింది. అది ఈ ఏడాది(2025) జనవరి 11న వచ్చింది. ఈ కారణంగా హిందూ క్యాలెండంను అనుసరించి అయోధ్యలో నేడు నూతన రామాలయ మొదటి వార్షికోత్సవాలు ప్రారంభమయ్యాయి.మూడు రోజుల ఉత్సవాలకు 110 మందికి పైగా వీఐపీలు హాజరుకానున్నారు.

## శబరిమల భక్తులకు ఫ్రీ ఇన్సూరెన్స్ స్కీమ్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కేరళలోని శబరిమల ఆలయాన్ని పర్యవేక్షించే ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు యాత్రికుల కోసం ఉచిత ప్రమాద బీమా పథకాన్ని తీసుకొచ్చింది. ఇటీవల జరిగిన వివిధ రోడ్డు ప్రమాదాల్లో దురదృష్టవశాత్తు పలువురు అయ్యప్ప భక్తులు మరణించడం వల్ల ఆ నిర్ణయం తీసుకుంది. తద్వారా ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం అందించనుంది. మండల- మకరవిళక్కు సీజన్ మరికొద్ది రోజుల్లో ముగియనున్న వేళ ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు ఆ ప్రమాద బీమా పథకాన్ని ప్రారంభించింది. పథనంతిట్ట, కొల్లాం, అలప్పుజ, ఇడుక్కి జిల్లాల్లో ప్రమాదం జరిగితే ప్రాణాలు కోల్పోయిన యాత్రికుల కుటుంబసభ్యులకు రూ.5 లక్షల పరిహారం అందించనుంది. అందుకు గాను యాత్రికుల నుంచి ఎటువంటి రుసుము వసూలు చేయడం లేదు. వర్చువల్ క్యూ పద్ధతి లేదా స్పాట్ బుకింగ్ ద్వారా బుక్ చేసుకున్న అందరి యాత్రికులకు ప్రమాద బీమా పథకం వర్తిస్తుంది. అందుకు గాను ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. అదనపు జిల్లాలకు కూడా బీమా పథక కవరేజీని విస్తరించే అంశంపై చర్చలు జరుపుతున్నట్లు దేవస్వం బోర్డు అధ్యక్షుడు పీఎస్ ప్రశాంత్ తెలిపారు.

# గేమ్‌ఛేంజర్' టికెట్ల ధరల పెంపు జీవో ఉపసంహరణ

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ హైకోర్టు ఆదేశాలతో గేమ్ ఛేంజర్ టికెట్ల ధరల పెంపునకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకున్నది. గేమ్ ఛేంజర్‌కు ఇచ్చిన వెసులుబాటును ఉపసంహరించుకుంటున్నట్లు శనివారం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో టికెట్ల ధరలతో పాటు అదనపు షోలకు ఇచ్చిన అనుమతులను ఉపసంహరించుకుంటున్నట్లు పేర్కొంది. తెలంగాణలో ఇకపై తెల్లవారు జామున స్పెషల్ షోలకు అనుమతి లేదని స్పష్టం చేసింది. ప్రజల ఆరోగ్యం, ఆరోగ్య భద్రత దృష్ట్యా స్పెషల్ షోలకు అనుమతి ఇవ్వబోమని పేర్కొంది.

# నెలాఖరులో కొత్త ఉస్మానియా ఆసుపత్రికి శంకుస్థాపన

- **సీఎం రేవంత్ రెడ్డి**

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



హైదరాబాద్ నగరంలో కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి ఈ నెలాఖరులోగా శంకుస్థాపన చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కొత్తగా నిర్మించబోయే ఉస్మానియా ఆసుపత్రికి సంబంధించిన ప్రణాళికలపై శనివారం ముఖ్యమంత్రి తన నివాసంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. గోషామహల్ పోలీస్ స్టేడియంలో ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ శాఖ పరిధిలో ఉన్న ఆ స్థలాన్ని వీలైనంత త్వరగా వైద్యఆరోగ్య శాఖకు బదిలీ చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రెండు శాఖల మధ్య భూ బదలాయింపు ప్రక్రియ, ఇతర పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు.

ప్రతిపాదిత స్థలంలో చేపట్టాల్సిన నిర్మాణాలకు సంబంధించిన నమూనా మ్యాప్‌లను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అధికారులు వివరించిన మ్యాప్‌లలో ముఖ్య మంత్రి గారు పలు మార్పులు, చేర్పులను సూచించారు. అన్ని రకాల ఆధునిక వసతులతో ఉండేలా ఆసుపత్రి నిర్మాణం ఉండాలని చెప్పా రు. ముఖ్యంగా రోడ్లు, పార్కింగ్, మార్చురీ, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నమూనాలను రూపొందించాలని సూచించారు. భవిష్యత్తులో రోడ్డు విస్తరణ, ఫ్లై ఓవర్ లాంటి నిర్మాణాలు చేపట్టినా ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ముందుచూపుతో డిజైన్లను రూపొందించాలన్నారు. అత్యాధునిక వసతులతో పాటు రోగుల సహాయకులు సేదతీరేందుకు గ్రీనరీ, పార్క్ లాంటి సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. కార్పోరేట్ ఆసుపత్రులకు ధీటుగా అత్యాధునిక వసతులతో ఆసుపత్రి నిర్మాణం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. కొత్త ఉస్మానియా ఆసుపత్రి భవనాలు, ఇతర నమూనాలకు సంబంధించి పూర్తిస్థాయి డిజైన్లను రూపొందించాలన్నారు. ఆసుపత్రి నిర్మాణానికి ఈ నెలాఖరులో శంకుస్థాపన చేసేందుకు వీలుగా అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# కుప్పకూలిన నిర్మాణంలో ఉన్న భవనం పైకప్పు



**బలగం టీవి, హైదరాబాద్**

ఉత్తరప్రదేశ్‌లోని కనౌజ్ రైల్వే స్టేషన్‌లో నిర్మాణంలో ఉన్న భారీ భవనం పైకప్పు శనివారం మధ్యాహ్నం ఒక్కసారి కుప్పకూలిపోవడంతో శిథిలాలకింద పలువురు చిక్కుకు పోయారు. 23 మంది గాయపడ్డారు. వారిలో ఆరుగురిని వెలికితీసి ఆస్పత్రికి తరలించారు. శిథిలాలు తొలగించి, అందరినీ రక్షించేందుకు సహాయ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. ఈ దుర్ఘటనపై నార్త్ ఈస్టర్న్ రైల్వే ముగ్గురు సభ్యుల ఉన్నతాధికారులతో దర్యాప్తునకు ఆదేశించింది. ఒకపక్క రైల్వే స్టేషన్‌లో జనం, మరో పక్క శిథిలాల కింద చిక్కుకున్న కూలీల హాహా కారాలతో స్టేషన్ దద్దరిల్లింది. నిర్మాణంలో ఉన్న పైకప్పు కుప్పకూలిందని ప్రాథమిక విచారణలో తేలినట్లు కలెక్టర్ తెలిపారు. శిథిలాల కింద చిక్కుకు పోయిన వారిని కాపాడడమే తమ తక్షణ కర్తవ్యం అన్నారు. ఉన్నతాధికారులు సహాయక చర్యలను దగ్గర ఉండి పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. తీవ్రంగా గాయపడిన వారికి రెండున్నర లక్షల రూపాయలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.50 వేలు ఎక్స్ గ్రేషియా ప్రకటించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ దళాలు సహాయ కార్యక్రమాల్లో తోడ్పడుతున్నాయి.

# వ్యవసాయ యోగ్యమైన భూమి ఉన్నవారందరికీ రైతు భరోసా

- **మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**బలగం టీవి, హైదరాబాద్**

వ్యవసాయ యోగ్యమైన భూమి ఉన్నవారందరికీ రైతు భరోసా ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. జనవరి 26 నుంచి కొత్త రేషన్ కార్డులు అర్హులందరికీ అందిస్తామన్నారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటన సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంత్రి పొంగులేటి ఇళ్ల పటాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడారు. రైతుభరోసా, ఇళ్లు ఇవ్వడంలేదని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారనిమండిపడ్డారు. అలాంటివి నమ్మొద్దు అని, వ్యవసాయ యోగ్యమైన భూమి ఉన్నవారందరికీ రైతు భరోసా ఇస్తామని స్పష్టం చేశారు. రైతుభరోసాకు ఎకరాకు సంవత్సరానికి 12 వేలు ఇవ్వబోతున్నామన్నారు. కొండలు, గుట్టలు, రియల్ ఎస్టేట్ భూములకు మాత్రమే రైతుబంధు ఉండదని స్పష్టం చేశారు. ఎవరూ అభద్రతకు లోనుకావద్దని, అన్ని ప్రభుత్వ పథకాలు వస్తాయని స్పష్టం చేశారు. ఈ నెల 26న మరో నాలుగు పథకాలు అమలు చేస్తామని, సంక్రాంతి పండుగ కానుకగా పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తున్నామని, గత ప్రభుత్వంలో కట్టకుండా వదిలేసిన ఇళ్లను కూడా నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున కేటాయిస్తామని, నాలుగు విడతల్లో రూ.5లక్షల ఆర్థికసాయం అందిస్తామని, ఈ నెల నుంచే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు.

## ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌కు భారత జట్టు ప్రకటన

**బలగం టీవి, హైదరాబాద్**

ఇంగ్లండ్ తో ఐదు మ్యాచ్ ల టీ20 సిరీస్ కోసం నేడు భారత జట్టును ప్రకటించారు. అందులో షమీకి కూడా స్థానం కల్పించారు. ఇంగ్లండ్ తో టీ20 సిరీస్ జనవరి 22 నుంచి ఫిబవరి 2 వరకు జరగనుంది. శనివారం సమావేశమైన బీసీసీఐ సీనియర్ సెలెక్షన్ కమిటీ ఈ సిరీస్ కోసం 15 మందితో కూడిన భారత జట్టును ఎంపిక చేసింది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్ గా వ్యవహరించనున్నాడు. అక్షర్ పటేల్ ను వైస్ కెప్టెన్ గా నియమించారు. ఇటీవల ఆస్ట్రేలియా టూర్ లో అదరగొట్టిన తెలుగుతేజం నితీశ్ కుమార్ రెడ్డి కూడా ఈ జట్టులో ఉన్నాడు.

**టీమిండియా జట్టు :** సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్, నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, అర్షదీప్ సింగ్, మహ్మద్ షమీ, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, వాషింగ్టన్ సుందర్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్).

# కాంగ్రెస్ గూండాలను వెంటనే అరెస్టు చేయాలి

- **ఎమ్మెల్సీ కవిత**

**బలగం టీవి, హైదరాబాద్**



భువనగిరిలోని బీఆర్ఎస్ కార్యాలయంపై దాడిని ఎమ్మెల్సీ కవిత ఖండించారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన దాడి అని ఆమె ఆరోపించారు. ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీ వల్లించే మొహబ్బత్ కీ దుకాన్ అనేది బూటకమని కాంగ్రెస్ ద్వేషాన్ని, హింసను రెచ్చగొట్టే దుఖాన్ అని అన్నారు. కాంగ్రెస్ డీఎన్ఏలో ద్వేషం ఉందని.. రాజకీయంగా ఎదుర్కోలేకనే దాడులు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ యువజన విభాగం కూడా రౌడీలు, గూండాల విభాగంగా మారిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ దుండగులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. భౌతిక దాడులతో గులాబీ సైనికులను భయపెట్టలేవని అన్నారు.

# నల్లగొండలో రైతు మహా ధర్నా వాయిదా

**బలగం టీవి, హైదరాబాద్**

నల్లగొండ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించబోయే బీఆర్ఎస్ మహా రైతు ధర్నా వాయిదా పడింది. సంక్రాంతి పండుగ ప్రయాణాలు, విజయవాడ – హైదరాబాద్ హైవేపై ట్రాఫిక్ రద్దీతో పాటు తదితర కారణాలతో పండుగ తర్వాత మహాధర్నా నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలతోపాటు రైతు రుణమాఫీ, రైతుభరోసా మోసాలపై బీఆర్ఎస్ పార్టీ పోరాటానికి సిద్ధమైన సంగతి తెలిసిందే. ఇప్పటికే రైతు భరోసా కుదింపుపై ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా రైతులు కొద్దిరోజులుగా ఆగ్రహంతో రోడ్లపైకి వస్తున్నారు. రైతుల ఆందోళన, ఆవేదనకు మద్దతుగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ రంగంలోకి దిగుతున్నారు. ఎన్నికల ముందు రైతు డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన హామీలన్నీ తూ.చ. తప్పకుండా అమలు చేయాలన్న డిమాండ్‌తో ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు మహాధర్నాకు పిలుపునిచ్చారు. ఈ రైతు మహాధర్నాకు కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని పార్టీ ప్రకటించింది. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో మహాధర్నాకు ఏర్పాట్లు జరుగుతున్నప్పటికీ.. సంక్రాంతి పండుగ రద్దీ, ఇతర కారణాల వల్ల వాయిదా వేశారు.

# వంద శాతం రుణమాఫీ నిరూపిస్తే రాజీనామా

- **ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి**

**బలగం టీవి, హైదరాబాద్**



హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలోని 106 పంచాయతీల్లో ఏ ఒక్క గ్రామంలోనైనా వందశాతం మంది రైతులకు రుణమాఫీ జరిగిందని సీఎం రేవంత్ రెడ్డి నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సవాల్ చేశారు. శనివారం కరీంనగర్ జిల్లా హుజురాబాద్ లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో రుణమాఫీ ఏ ఒక్క గ్రామంలో కూడా పూర్తిగా జరగలేదని, 70శాతం మాత్రమే జరిగిందని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో చెప్పారన్నారు. రైతుల పట్ల రేవంత్ ప్రభుత్వం పక్షపాత ధోరణిని అవలంబిస్తుందన్నారు. రుణమాఫీ మాదిరిగానే రైతు భరోసా కూడా కొద్ది మంది రైతులకే పరిమితం చేసే విధంగా ప్రభుత్వం రోజుకో మాట చెబుతోందన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన విధంగా అన్ని పంటలకు, ప్రతి రైతుకు భరోసా ఇవ్వాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో రైతు బంధులో రూ.22వేల కోట్లు వృధా అయ్యాయని పేర్కొనడం విచిత్రంగా ఉందన్నారు. ప్రతి గ్రామంలో విచారణ చేపట్టి ఎక్కడ వృధా అయ్యాయో చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 24గంటల విద్యుత్, వేసవికాలంలో కూడా మత్తళ్ళు దూకే విదంగా సాగునీటి సౌకర్యం ఉండేదని, ప్రస్తుతం సాగునీటికి రైతులు ఇబ్బందులు పడుతున్నారని, శ్రీరాంసాగర్ నీటిని ఖమ్మం వరకు తీసుకుపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలోని రైతులకు సాగునీటిని ఎందుకు విడుదల చేయడం లేదో చెప్పాలన్నారు. రెండు రోజుల్లో నీటిని రైతులకు విడుదల చేయకపోతే గేట్లను రైతులతో వచ్చి తానే విప్పుతానన్నారు. కాల్వల ప్రాజెక్టు కట్టను పునరుద్ధరణ చేయాలని తాను అసెంబ్లీలో మాట్లాడినా ఇప్పటికీ ప్రభుత్వం నుండి స్పందన లేదన్నారు. రూ.70కోట్లు విడుదల చేసి కాల్వల ప్రాజెక్టును కాపాడాలన్నారు. నేను పోరాటం చేసేది ప్రభుత్వంపైన.. పోలీసులపై కాదని, ప్రభుత్వ నియంత్ర ధోరణిపై అని అన్నారు. తనపై ఇప్పటికి 30కేసులు నమోదు చేశారని, అయినా ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ఆపేదిలేదన్నారు. ఆరు గ్యారంటీలు, 420హామీలు అమలయ్యే వరకు పోరాటం చేస్తామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలో గతంలో ఇచ్చిన రెండో విడత దళిత బంధును కాంగ్రెస్ ప్రభుత్వం ఆపిందని, అకౌంట్లలో ఉన్న డబ్బులు గత ప్రభుత్వం విడుదల చేస్తే ఈ ప్రభుత్వం నిలిపివేసి ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. వెంటనే దళిత బంధు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# ఆదివాసుల కోసం ఎన్నో చట్టాలు తెచ్చిన కాంగ్రెస్

- **మంత్రి కోమటి రెడ్డి**

**బలగం టీవి, హైదరాబాద్**

ఆదివాసులతో కాంగ్రెస్ పార్టీకి ఉన్న అనుబంధం ఈనాటిది కాదని, 75 ఏళ్లుగా కొనసాగుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. నెహ్రూ ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలోనే ఆదివాసిల కోసం ఎన్నో చట్టాలను తెచ్చారన్నారు. నాగార్జున సాగర్ లో గిరిజన ఆదివాసీ కాంగ్రెస్ నాయకులకు రాజకీయ శిక్షణ తరగతుల్లో మాట్లాడారు. గిరిజన హక్కుల పరిరక్షణ యాక్ట్, పీసా యాక్ట్, అటవీ హక్కుల యాక్ట్ ఇలా ఎన్నో చట్టాలను ఆదివాసీల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిందన్నారు. మాజీ ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఆధ్వర్యంలో సామాజిక, ఆర్థిక, విద్య , రాజ్యాంగంలో ఆర్టికల్ 46 ని చేర్చడం జరిగిందని తెలిపారు. అది ఒక్కటే కాదు.. కాంగ్రెస్ పార్టీ పాలనలో ఆర్టికల్ 244 వంటి ఎన్నో చట్టాలను తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. దళితులకు, గిరిజనులకు చట్టసభల్లో రిజర్వేషన్ చేసింది కాంగ్రెస్ పార్టీ. ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేసిన ఘనత కూడా కాంగ్రెస్ పార్టీదే అని తెలిపారు.



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

**బలగం టీవీ , బోయినిపల్లి**


రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో బోయినిపల్లి మండల పవర్ లూమ్స్ కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పవర్ లూమ్ సంఘం అధ్యక్షులు దూస జనార్దన్ మాటడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని చేనేత జౌళి కార్మికుల కోసం 168 కోట్లతో చేనేత అభయ హస్తం పథకం ప్రారంభించి, పవర్ లూం కార్మికుల అభివృద్ధి కృషి చేయడం సంతోష కరమని తెలిపారు. రాష్ట్రంలో పవర్ లూమ్ కార్మికులకు లకు 5 లక్షల ఇన్స్యూరెన్స్,భరోసా 18 వేలు ఇవ్వటం, త్రిఫ్ట్ పథకం గత ప్రభుత్వం 36 నెలలు ఉండేదని, ఇప్పుడు 24 నెలలు చేయడం గొప్ప విషయం అని, చాలా సంతోషం అని ముఖ్యమంత్రికి మరియు రాష్ట్ర రవాణా మరియు బిసి సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ మరియు చొప్పదండి నియోజకవర్గం శాసనసభ్యులు మేడిపల్లి సత్యంలకు అభినందనలు తెలిపారు.భవిష్యత్ లో ఇదే విధంగా పవర్ లూమ్స్ సంక్షేమం కోసం పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వన్నెల రమణా రెడ్డి,వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బోయిని ఎల్లేశ్, కాంగ్రెస్ నేతలు సంబ లచ్చయ్య, లక్ష్మారెడ్డి, మహేష్, హుస్సేన్, సంఘం నాయకులు దుస జనార్దన్, ఉపాధ్యక్షులు శ్రీపతి దేవయ్య, కార్యదర్శి బిళ్ళ రమేష్, కోశాధికారి శ్రీపతి రవీందర్, డైరక్టర్ లు మ్యాన రమేష్ , శ్రీపతి జనార్దన్, బీమనతుని శ్రీనివాస్, దేవసని శ్రీనివాస్, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.




# వడ్డే ఓబన్న జీవితం స్ఫూర్తిదాయకం..

- తొలితరం స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న చరిత్ర చిరస్మరణీయం
- కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్





**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ప్రధాన అనుచరుడిగా బ్రిటిష్ ఇండియా కంపెనీ వ్యతిరేకంగా చేసిన పోరాటంలో ఓబన్న పోషించిన పాత్ర చరిత్రలో నిలిచిపోతుందని కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు . శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన వడ్డే ఓబన్న 218వ జయంతి వేడుకలకు కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ ముఖ్య అతిథిలు గా హాజరై జ్యోతి ప్రజల చేశారు. అనంతరం వడ్డే ఓబన్న చిత్రపటానికి కలెక్టర్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం సాధించడం కోసం అనేకమంది మహనీయులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వీరోచిత పోరాటం చేశారని, ఆ మహనీయులలో వడ్డే ఓబన్న తొలితరం స్వాతంత్ర సమర యోధుడని, 1857 లో జరిగిన సిపాయిల పోరాట కంటే ముందస్తుగా ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. తొలి తరం స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి అధికారికంగా నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందని, మహనీయులు చేసిన గొప్ప పనులను స్మరించుకోవడం వల్ల వారు అందించిన స్ఫూర్తి విలువలు మనకు తెలుస్తాయని అన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ పన్నుల విధానానికి వ్యతిరేకంగా విరోచిత పోరాటం చేశారని అన్నారు. దేశానికి అన్ని వర్గాల వారు అన్ని ప్రాంతాల వారి పోరాట ఫలితంగానే స్వాతంత్రం లభించిందని, మనం ఈరోజు అనుభవిస్తున్న స్వాతంత్రం సాధించడం కోసం వారు చేసిన త్యాగాలను ఎప్పటికీ స్మరించుకోవాలని అన్నారు.మహనీయుల జయంతి ఉత్సవాలు నిర్వహించుకోవడం వల్ల వారు అందించే విలువలు మనందరికీ మెరుగైన సమాజ నిర్మాణానికి దోహదపడతాయని అన్నారు. సమావేశంలో జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి రాజ మనోహర్, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, డిపిఆర్వో వి.శ్రీధర్, వడ్డెర కుల సంఘం నాయకులు , ఇతర బి.సి. సంఘ నాయకులు, వడ్డెర కులస్తులు, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీని ప్రారంభించిన కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి..

**బలగం టీవీ ,సిరిసిల్ల**



ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీ హెచ్ సీ) శనివారం కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రారంభించారు. రూ. 1 కోటి 56 లక్షలతో పీ హెచ్ సీ భవనాన్ని నిర్మించగా, ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి. దవాఖాన ఆవరణ, ఇన్ పేషెంట్ గదులు, ఓపీ గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ బీపీ చెక్ చేశారు. ఇక్కడ అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత, మెడికల్ ఆఫీసర్ శరణ్య తదితరులు పాల్గొన్నారు.

# కబ్జాకు గురైన భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలి..

- రాజకీయాలకతీతంగా కలిసి పని చేయాలి
- జిల్లాకు నవోదయ పాఠశాల మంజూరుకు కృషి
- వేములవాడను ప్రసాద్ స్కీం కింద చేర్చబోతున్నాం
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

ప్రజల అభ్యున్నతి కోసం రాజకీయాల కతీతంగా నాయకులంతా కలిసి పని చేయాలని కేంద్ర హెూం శాఖ సహాయక మంత్రి బండి సంజయ్ అన్నారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో కేంద్ర హెూం శాఖ సహాయక మంత్రి వర్యులు బండి సంజయ్ , ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మాన కొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్య నారాయణ, సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ సమాజంలో అన్ని అవయవాలు ఉన్న మనమే అనేక సమస్యలకు సతమ తమవుతున్నామని,దివ్యాంగుల ఇబ్బందులు వర్ణణాతీతంమని అన్నారు. దివ్యాంగుల మనో నిబ్బరం, ధైర్యం గ్రేట్ అని అన్నారు.కేంద్ర ప్రభుత్వం ఏ డి ఐ పీ,రాష్ట్రీయ వయోశ్రీ యోజన పథకాల కింద ఈరోజు 69 లక్షల 54 వేల 911 రూపాయల విలువైన 675 పరికరాలను ఈరోజు 322 మంది దివ్యాంగులకు అందించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.

రెండేళ్ల క్రితం ఈ జిల్లాలోనే 1930 మంది దివ్యాంగులకు 2 కోట్ల 33 లక్షల 47 వేల 768 రూపాయల సమసవిలువైన పరికరాలను పంపిణీ చేసిన విషయం తనకింకా గుర్తుందని,అట్లాగే కరీంనగర్ జిల్లాలో కూడా గతేడాది పెద్ద క్యాంపు నిర్వహించి 750 మందికిపైగా కోట్ల రూపాయల ఖర్చు చేసి పరికరాలు అందించినమని అన్నారు.కే వలం నాలుగేళ్లలోనే నా పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో దివ్యాంగులు, మహిళలు, వృద్దుల సంక్షేమం కోసం 100 కోట్లకుపైగా నిధులు ఖర్చు చేసినమని,దివ్యాంగుల, వృద్దుల ఆశ్రమాలకు కేంద్రం పెద్ద ఎత్తున నిదులు మంజూరు చేస్తోందని అన్నారు. 5 ఏళ్లలో ఎన్నడూ కలెక్టరేట్ కు రాలేదని,ఏ కార్యక్రమంలో పాల్గొనలేదు, ఎందుకంటే గతంలో నన్ను ఏ కార్యక్రమానికి పిలవలేదని,కలెక్టరేట్ కు వెళితే వెంటనే బాధ్యులను బదిలీ చేసే వాళ్లు అని అన్నారు. ఇప్పుడు ఆ పార్టీ నేతలు కలెక్టర్ ను దూషిస్తున్నారని,అధికారులను పట్టుకుని తిడుతున్నరని అన్నారు. కలెక్టర్, ఎమ్మెల్యేలారా బీఆర్ఎస్ ప్రభుత్వం కబ్జా చేసిన స్థలాలు, భవనాలన్నీ స్వాధీన పర్చుకోండని,గతంలో ఎకరాలకు ఎకరాలు కబ్జాలు చేసి దోచుకుంటామంటూ చూస్తూ ఊరుకోవడానికి సిద్ధంగా లేముని,పొట్టొడిని పొడుగోడు కొడితే, పొడుగోడిని పోచమ్మ కొడతదనే సంగతి గుర్తుంచుకోవాలని అన్నారు.పేదల భూములను కబ్జాలు చేసిటోళ్లను, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించనోళ్లపై ఉక్కుపాదం మోపండని,మీ వెంట వేల మంది అండగా ఉంటారని,ఎందుకంటే ప్రభుత్వ భవనాలకు, మంచి పనులు చేయాలంటే ప్రభుత్వ స్థలాలు లేకుండా చేశారని,ధరణి పేరుతో భూములన్నీ దోచుకున్నరని,ఒక కుటుంబమే ఎక్కువగా లాభపడ్డదని,ప్రభుత్వ భూములన్నీ ప్రైవేట్ పరం చేశారని అన్నారు. సిరిసిల్ల జిల్లాలో నవోదయ స్కూల్ త్వరలో మంజూరు కాబోతోందని,ఆ మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపినమని గతంలో ప్రసాద్ స్కీం కింద నిధులిస్తాం ప్రతిపాదనలు పంపాలని కోరితే నాటి ప్రభుత్వం పట్టించుకోలేదని,ఈ ప్రభుత్వం మేం ప్రతిపాదనలు పంపిన వెంటనే పంపారని,అతి త్వరలోనే వేములవాడ రాజన్న ఆలయాన్ని ప్రసాద్ స్కీంలో చేర్చుతమని అన్నారు.

ఎంపీగా, కేంద్ర మంత్రిగా గెలిచానంటే మీరు పెట్టిన భిక్షే అని,మీరు గెలిపిస్తేనే ఈ స్థాయికి వచ్చిన, కలిసి పనిచేస్తా, కేంద్రం నుండి అవసరమైన నిధులన్నీ తెచ్చి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తానని అన్నారు. నా లక్ష్యం ఒక్కటే,నా పార్లమెంట్ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్క దివ్యాంగుడికి అందజేస్తామని, ఇంకా ఎవరైనా దివ్యాంగులు మిగిలి ఉంటే వాళ్ల జాబితా కూడా రడీ చేయండని,వాళ్లందరికీ పరికరాలు అందించే ఏర్పాట్లు చేద్దామని అన్నారు.ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు చెందిన నాయకులు కరీంనగర్ జిల్లాలో గొప్ప స్థాయికి ఎదగడం తన వ్యక్తిగతంగా చాలా సంతోషంగా ఉందని అన్నారు. సిరిసిల్ల జిల్లాలో 9 వేలకు పైగా దివ్యాంగులకు ఫించన్ పంపిణీ చేస్తున్నామని అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో కలెక్టర్ ప్రత్యేక చోరువతో దివ్యాంగులకు ప్రభుత్వ స్థలంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశారని అన్నారు. ప్రభుత్వానికి సంబంధించిన వాహనాల పెట్రోల్ ఇక్కడ నుంచే తీసుకునే విధంగా, దీని ద్వారా దివ్యాంగులకు ప్రత్యేకంగా ఆదాయం లభించే విధంగా చర్యలు చేపట్టామని అన్నారు. నేడు జిల్లాలో 322 మంది దివ్యాంగులకు 674 ఉపకరణాలు పంపిణీ చేస్తున్నామని, భవిష్యత్తులో మరోసారి క్యాంప్ నిర్వహించే పెండింగ్ ఎవరైనా దివ్యాంగులు ఉంటే వారికి పంపిణీ చేసేందుకు చర్యలు చేపడతామని, అదేవిధంగా కొంతమంది దివ్యాంగులకు ప్రత్యేకంగా జైపూర్ నుంచి కాలు తయారుచేసి తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టామని అన్నారు.

2024-25 సంవత్సరంలో వేములవాడ ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం 75 కోట్ల పరిపాలన అనుమతులు మంజూరు చేసిందని, ఆలయ అభివృద్ధిలో కేంద్రమంత్రి సహకారం అందించాలని, వేములవాడలో రోడ్డు వెడల్పు పనులకు 47 కోట్లు మంజూరు చేసి శంకుస్థాపన చేశామని , అన్నదాన సత్రానికి 35 కోట్లు మంజూరు చేశామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రసాద్ పథకం కింద నిధులు మంజూరు అయ్యే విధంగా కృషి చేయాలని అన్నారు. రాష్ట్రంలో ఉన్న పారిశ్రామికవేత్తలతో చర్చించి వేములవాడ ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలను సీ.ఎస్.ఆర్ కింద అభివృద్ధి చేయాలని అన్నారు. పిల్లలకు ఐఐటి, నీట్ శిక్షణ ఇట్టి ఇచ్చేందుకు సహకారం అందజేయాలని, సిరిసిల్ల జిల్లాలో నవోదయ పాఠశాల మంజూరుకు కృషి చేయాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు.


కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ.. అలింకో ద్వారా ఆగస్టు 4 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు క్యాంపు నిర్వహించి 675 మంది దివ్యాంగులను ఎంపిక చేసి 65 లక్షల పైగా విలువగల ఉపకరణాలను పంపిణీ చేయడం జరుగుతుందని, ఈ కార్యక్రమం చాలా సంతోషకరమైన విషయం అని అన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్య నారాయణ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉండి కలెక్టర్ ఆధ్వర్యంలో , ట్రై సైకిల్స్, వినికిడి యంత్రాలు, బ్యాటరీ సైకిళ్ళు వంటి ఉపకరణాలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. అంగవైకల్యంతో పుట్టిన ప్రజల అభ్యున్నతికి మనమంతా పనిచేయాలని అన్నారు.దివ్యాంగుల తో నడిపే పెట్రోల్ బంక్ నేడు చాలా బాగా జరుగుతుందని అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా మాదిరిగానే కరీంనగర్ జిల్లాలో కూడా ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే అన్నారు.దివ్యాంగులకు నిర్వహించిన వివిధ రకాల ఆటల పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం కేంద్ర మంత్రివర్యులను, ప్రభుత్వ విప్ లను జిల్లా కలెక్టర్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, వికలాంగుల సంక్షేమం అధ్యక్షులు రాము, సిరిసిల్ల మున్సిపల్ చైపర్సన్ కళా చక్రపాణి , వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మి రాజం, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రవీంద్ర జడేజా గుడ్‌బై చెబుతున్నాడా..?

**బలగం టీవీ, హైదరాబాద్**

టీమిండియా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా టెస్టు క్రికెట్‌కు గుడ్‌బై చెప్పే అవకాశం ఉందనే వార్తలు వస్తున్నాయి. తాజాగా జడేజా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా టెస్ట్ జెర్సీని షేర్ చేశాడు. దాంతో అభిమానులు, క్రికెట్ నిపుణులు ఆయన రిటైర్మెంట్ గురించి అంచనా వేస్తున్నారు. గతేడాది జడేజా టీ20 క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు. ప్రస్తుతం వన్డే,, టెస్టు క్రికెట్‌లో కొనసాగుతున్నాడు.

తాజాగా ఆస్ట్రేలియా పర్యటనలో జడేజాపై సైతం విమర్శలు వచ్చాయి. బోర్డర్ గవాస్కర్ సిరీస్‌ను టీమిండియా 1-3 తేడాతో ఓటమిపాలైంది. ఆసిస్ పర్యటనలో జడేజా మూడు మ్యాచుల్లో కేవలం నాలుగు వికెట్లు తీశాడు. 27 సగటుతో 135 పరుగులు చేశాడు. సమాచారం మేరకు.. జడేజా ప్రదర్శనపై సైతం సెలెక్టర్లు దృష్టి సారించారని.. సెలక్షన్ కమిటీతో బీసీసీఐ జడేజా భవిష్యత్‌పై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. జడేజా ఇకపై టెస్టుల్లో కొనసాగడం కష్టమేనని పలు మీడియా నివేదికలు పేర్కొంటున్నారు. భారత్ ఈ నెల 22 నుంచి ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచుల టీ20, మూడు వన్డేలు ఆడనున్నది. ఫిబ్రవరి 19 నుంచి చాంపియన్స్ ట్రోఫీ ప్రారంభమవుతుంది. ఇంగ్లాండ్ సిరీస్‌తో పాటు చాంపియన్స్ ట్రోఫీకి సైతం జట్టును త్వరలోనే ప్రకటించనున్నారు. ఈ క్రమంలో ఇంగ్లాండ్‌తో సిరీస్, ఐసీసీ ఈవెంట్‌కు జడేజాను ఎంపిక చేస్తారా? లేదా? అన్ని ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. 2027 వన్డే



ప్రపంచకప్‌ని దృష్టిలో పెట్టుకొని సెలక్షన్ కమిటీతో పాటు హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలనే ఆలోచన ఉన్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఈ క్రమంలో జడేజాకు అవకాశం ఇవ్వాలా? అన్న విషయంపై సెలెక్టర్లు చర్చిస్తున్నట్లు తెలుస్తున్నది.



# కార్చిచ్చులో తగలబడిన ఒలింపిక్ మెడల్స్

**బలగం టీవీ, హైదరాబాద్**

అమెరికా లాస్ ఏంజెలెస్‌లో చెలరేగిన కార్చిచ్చు వల్ల పలువురి సెలబ్రెటీలు, రాజకీయ నాయకుల ఇళ్లు బూడిదయ్యాయి. అయితే ఈ కార్చిచ్చు వల్ల అమెరికాకు చెందిన మాజీ స్విమ్మర్ గ్యారీ హాల్ జూనియర్ 10 ఒలింపిక్ పతకాలను పోగొట్టుకున్నాడు.

లాస్ ఏంజెలెస్‌ను కార్చిచ్చు కమ్మేసింది. ఈ మంటల్లో గ్యారీ హాల్ జూనియర్ ఇల్లు కూడా కాలిపోయింది. అదృష్టవశాత్తు మంటలను గమనించిన అతడు అక్కడి నుంచి తప్పించుకున్నాడు. అయితే అతడు సాధించిన 10 ఒలింపిక్, 6 వరల్డ్ ఛాంపియన్‌షిప్ మెడల్స్ ఆ మంటల్లో కాలిపోయాయి. "పతకాలు కాలిపోయాయా? అని అందరూ అడుగుతున్నారు. అవును, అన్నీ కాలి బూడిదైపోయాయి. అవి లేకుండా బ్రతకలేను. అన్నీ కాలిపోయాయి. మళ్లీ కష్టపడి మొదలుపెట్టాలా? ఏం చేయాలి? నా ఇల్లు ఉండే చోటుకు మళ్లీ ఎప్పుడు వెళ్తాను? ఒకవేళ వెళ్లినా కూడా ఆ బూడిదలో నా మెడల్స్ కరిగిపోయుంటాయి. నా విలువైనదంటూ ఏమి మిగలలేదు. జీవితం కోసం పరుగెత్తే క్రమంలో ఆ మెడల్స్ తో ఫొటోలు కూడా దిగలేదు. చాలా అత్యంత దారుణమైన ఘటన ఇది. నా కూతురుతో ఫోన్ మాట్లాడుతున్నప్పుడు ఇంటి వెనుక నుంచి దట్టమైన పొగ వచ్చింది. ఇళ్లన్నీ మంటల్లో కాలిపోతూ బూడిద అయిపోవడం చూశాను. దీంతో వెంటనే ప్రాణాలు కాపాడుకోవడం కోసం నా కుక్కను, కొన్ని వస్తువులను తీసుకుని పరుగెత్తాను" అని 50 ఏళ్ల గ్యారీ తన బాధను వ్యక్తం చేశాడు. హాల్ 2000 (సిడ్నీ), 2004 (ఏథెన్స్) ఒలింపిక్స్ లో వరుసగా బంగారు పతకాలు గెలుచుకున్నాడు. 1996 (అట్లాంటా) ఒలింపిక్స్ లో మూడు స్వర్ణాలను ఖాతాలో వేసుకున్నాడు. ఆ తర్వాత ఒలింపిక్ క్రీడల్లో మూడు రజతాలు, రెండు కాంస్య పతకాలను సాధించాడు.

# ఆఖరి వన్డేలో శ్రీలంక ఘన విజయం

**బలగం టీవీ, హైదరాబాద్**



న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా అక్లాండ్ వేదికగా శనివారం జరిగిన ఆఖరి వన్డేలో శ్రీలంక 140 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ఈ సిరీస్‌ను ఇప్పటికే 2-0తో కైవసం చేసుకున్న న్యూజిలాండ్.. ఆఖరి వన్డేలో మాత్రం దారుణంగా విఫలమైంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 290 పరుగులు చేసింది. పాతుమ్ నిస్సంక(42 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లతో 66), కుశాల్ మెండిస్(48 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 54), జనిత్ లియనగే(52 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 53) హాఫ్ సెంచరీలతో రాణించారు.న్యూజిలాండ్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ(4/55) నాలుగు వికెట్లు తీయగా.. మిచెల్ సాంట్నర్(2/55) రెండు వికెట్లు పడగొట్టాడు.నాథన్ స్మిత్, మైఖేల్ బ్రేస్‌వెల్ తలో వికెట్ తీసారు. అనంతరం లక్ష్యచేధనకు దిగిన న్యూజిలాండ్ 29.4 ఓవర్లలో 150 పరుగులకు ఆలౌటైంది. మార్క్ చాప్‌మన్(81 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 81)హాఫ్ సెంచరీతో ఒంటరి పోరాటం చేశాడు. శ్రీలంక బౌలర్లలో అసిత ఫెర్నాండో, మహీష్ తీక్షణ, ఇషాన్ మలింగా మూడేసి వికెట్లు తీయగా.. జనిత్ లియనగే ఓ వికెట్ పడగొట్టాడు. మూడు టీ20లు, మూడు వన్డేల కోసం న్యూజిలాండ్ పర్యటనకు వచ్చిన శ్రీలంక.. రెండు సిరీస్‌లను 1-2, 1-2 తేడాతో ఓటమిపాలైంది.

# సౌత్ వాళ్లు తిండి మానేస్తారు కానీ సినిమాలు మానరు

**బలగం టీవీ, హైదరాబాద్**

'ఊహలు గుసగుసలాడే' సినిమాతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన హీరోయిన్ రాశి ఖన్నా ఒకప్పుడు టాలీవుడ్‌లో వరుస సినిమాలు చేసి ప్రస్తుతం బాలీవుడ్‌కి షిఫ్ట్ అయిన విషయం తెలిసిందే. షాహిద్ కపూర్ నటించిన ఫర్జీతో పాటు విక్రాంత్ మస్సే 'ది సబర్మతి రిపోర్ట్' చిత్రాలతో మంచి హిట్లు అందుకుంది. రీసెంట్‌గా తమన్నా, రాశిఖన్నాలు కలిసి 'అరుణ్మణై-4' అనే సినిమాలో నటించి మంచి విజయాన్ని తమ ఖాతాలో వేసుకున్నారు. ప్రస్తుతం రాశీ బాలీవుడ్‌లో వరుస చిత్రాలతో పాటు తెలుగులో సిద్దు జొన్నలగడ్డ సరసన 'తెలుసు కదా' అనే మూవీతో పాటు, తమిళంలో 'అగాథియా' అనే పిరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌లో నటిస్తోంది.

తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రాశి ఖన్నా అక్కడ ఆసక్తికర విషయాలను పంచుకుంది. ఆమె మాట్లాడుతూ.. 'సౌత్‌లో సినిమా అభిమానులు ఎక్కువ అక్కడ హీరోలని దేవుళ్లుగా కొలుస్తారు. మూవీ రిలీజ్ అయినప్పుడు పండుగలా భావిస్తారు. అందుకే దక్షిణాదిలో ప్రేక్షకులు తిండి అయినా మానేస్తారేమో కానీ సినిమాలు చూడటం మాత్రం ఆపరు. అదే నార్త్‌లో ప్రజలు సినిమాలు పక్కన పెట్టి మిగతా వాటికి ఎక్కువ ఇంపార్టెన్స్ ఇస్తారు. ఆ తర్వాత సినిమాలు చూస్తారు' అని రాశి ఖన్నా చెప్పుకొచ్చింది.



# మొదటి రోజే 'గేమ్ ఛేంజర్'కు రూ.186 కోట్లు..!

**బలగం టీవీ, హైదరాబాద్**




రామ్ చరణ్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం గేమ్ ఛేంజర్. శంకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు ఈ సినిమాను నిర్మించాడు. ఈ సినిమా తొలిరోజే రికార్డు కలెక్షన్లు అందుకున్నట్టు తెలుస్తోంది. మొదటిరోజు ఈ చిత్రం వరల్డ్ వైడ్‌గా రూ.186 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టినట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. దీంతో ఈ ఫీట్ సాధించిన టాప్ టెన్ ఇండియన్ సినిమాలలో గేమ్ ఛేంజర్ కూడా నిలిచింది. ఇక మొదటి రోజు అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రాలు చూసుకుంటే.. అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 ది రూల్ చిత్రం మొదటి స్థానంలో ఉంది. ఈ చిత్రం ఫస్ట్ రోజు రూ.294 కోట్ల వసూళ్లను రాబట్టింది. పుష్ప తర్వాత ఆర్ఆర్ఆర్ (రూ.223 కోట్లు), బాహుబలి 2(రూ.214 కోట్లు) చిత్రాలు ఉన్నాయి.

# వెరీ నైస్ ఫెస్టివల్ ఫిల్మ్‌తో వస్తున్నాం : వెంకటేశ్



**బలగం టీవీ, హైదరాబాద్**

విక్టరీ వెంకటేష్, అనిల్ రావిపూడి, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ కొలాబరేషన్ లో వస్తున్న మూవీ 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్ రాజు సమర్పణలో శిరీష్ ఈ చిత్రాన్ని గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూరుస్తున్నారు. జనవరి 14న 'సంక్రాంతికి వస్తున్నాం' ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా హీరో విక్టరీ వెంకటేష్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

" సంక్రాంతికి నా నుండి ఇప్పటి వరకు చాలా సినిమాలు వచ్చాయి. ఇప్పుడు మరో సినిమా రాబోతోంది. ఒక క్లీన్ ఎంటర్‌టైనింగ్ ఫిల్మ్‌తో ఈ సంక్రాంతికి వస్తుండటం చాలా ఆనందంగా వుంది. లిటిల్ క్రైమ్ ఎలిమెంట్ న్యూ జానర్ కూడా వుంది. ఈ సినిమా జర్నీని చాలా ఎంజాయ్ చేశాను. నా కెరీర్‌లో సంక్రాంతికి వచ్చిన చాలా సినిమాలు పెద్ద విజయం సాధించాయి. ఈ సినిమా కూడా అద్భుతమైన విజయాన్ని అందుకుంటుందని ఆశిస్తున్నాను అసలీ సినిమా అనుకున్నప్పుడు.. ఎక్స్ కాప్, ఎక్స్ గర్ల్ ఫ్రెండ్, ఎక్సలెంట్ వైఫ్.. ఈ లైనే చాలా ఫ్రెష్‌గా అనిపించింది. మినిమం గ్యారెంటీ అని అక్కడే అర్థమైంది. అనిల్ రావిపూడిది, నాది సూపర్ హిట్ కాంబినేషన్. ఎర్ఫార్మెన్స్ వైజ్ ఇందులో మాత్రం కామెడీ స్టయిల్ డిఫరెంట్‌గా వుంటుంది. నా నుండి చాలా ఫ్రెష్ సీన్స్ ఇందులో వుంటాయి. సినిమా అద్భుతంగా వచ్చింది. అనిల్‌తో మళ్లీ మళ్లీ మూవీస్ చేయాలని ఉంది. తను ఈ సినిమాని 70 రోజుల్లో ఫినిష్ చేయడం చాలా హ్యాపీగా అనిపించింది. అనుకున్నదాని ప్రకారం అన్నీ అద్భుతంగా కుదిరాయి.

సంగీత దర్శకుడు భీమ్స్ చాలా హార్డ్ వర్క్ చేశాడు.తనకి ఈ సినిమా మంచి బ్రేక్ ఇస్తుందనే నమ్మకంతో ఉన్నాడు. ఫస్ట్ ట్యూన్ వినగానే హిట్ అనుకున్నాం. అది సూపర్ బ్లాక్ బస్టర్ అయ్యింది. అది ఆడియన్స్ గొప్పదనం. 'గోదారి గట్టు' సాంగ్ 85 మిలియన్ వ్యూస్ క్రాస్ చేసింది. ఆ పాటే కాదు, అన్ని పాటలకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. మరీ ప్రత్యేకంగా రమణ గోగుల పాడిన 'గోదారి గట్టు' పాట పెద్ద హిట్ అయ్యింది. ఇక నేను పాడిన పాట గురించి చెప్పాలంటే.. నైట్ రెండు గంటలకి ఆ సాంగ్ విన్నప్పుడు తెలియకుండానే డ్యాన్స్ చేశాను. ఏదో క్రేజీ ఎనర్జి ఆ సాంగ్‌లో వుంది. సరదాగా నేనే పాడతానని అన్నాను. ఆ రోజు గొంతు బాగానే వుంది. పాటలో ఇంగ్లీష్ వర్డ్స్ వుండటంతో నాకు ఇంకా ఈజీ అయ్యింది. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ చాలా మంచి క్యారెక్టర్స్ చేశారు. చక్కగా పెర్ఫామ్ చేశారు. క్యారెక్టర్స్ వెరీ క్రేజీగా వుంటాయి.

అనిల్ గారు మీ ఎక్స్ కాప్ క్యారెక్టర్ చెప్పినప్పుడు చాలా సరదాగా అనిపించింది. ఎక్స్ గర్ల్ ఫ్రెండ్ వచ్చి.. నా గురించే ఆలోచిస్తున్నావా ? నేను వచ్చే లోపల నలుగురిని కన్నావ్..అన్నప్పుడు చాలా హిలేరియస్‌గా అనిపించింది. అలాంటి సీన్స్ చేయడం చాలా ఎంజాయ్ చేశాను. ఇందులో నాకు నలుగురు పిల్లలు. అందులో ఒకడిని చాలా హ్యాండిల్ చేయాల్సివచ్చింది(నవ్వుతూ).ఇందులో క్లైమాక్స్ లో చెప్పే డైలాగ్స్ చాలా క్రేజీ వుంటాయి. ఆడియన్స్ చాలా ఎంటర్టైన్ అవుతారు. యూత్ డైలాగ్స్ ని చాలా లవ్ చేస్తారు ప్రతి సినిమా నా సొంత సినిమాగా చేస్తాను. ప్రతి ఒక్కరూ హ్యాపీగా వుండాలని కోరుకుంటాను. సిన్సియర్ గా పని చేస్తాను. దిల్ రాజు గారి ప్రొడక్షన్ సీతమ్మ వాకిట్లో నుంచి ట్రావెల్ అవుతున్నాను. వారితో జర్నీ చాలా కంఫర్ట్ బుల్ గా వుంటుంది. మేము చేసిన సినిమాన్నీ బాగా ఆడాయి. వారికి మరిన్ని విజయాలు రావాలని కోరుకుంటున్నాను.

వెరీ నైస్ ఫెస్టివల్ ఫిల్మ్ తో వస్తున్నాం. చాలా ఎంటర్‌టైన్మెంట్ వుంటుంది. క్లైమాక్స్ చాలా సర్ ప్రైజ్ చేస్తుంది. పిల్లలు, పెద్దలు, యూత్ అందరూ ఎంజాయ్ చేస్తారు. బాలయ్య అన్ స్టాపబుల్ షోకి వెళ్ళడం ఐయామ్ గ్లాడ్. వెరీ గుడ్ టైం. వెరీ నైస్ ఎక్స్ పీరియన్స్. రానా నాయుడు మార్చిలో రావచ్చు. డబ్బింగ్ అయ్యింది. సురేష్ ప్రొడక్షన్, సితార వంశీ, మైత్రీ, వైజయంతి మూవీస్ లో కథల పై వర్క్ జరుగుతుంది. ఇంకా ఏదీ ఫైనలైజ్ కాలేదు.

# యువత మేలుకో... నీ గమ్యాన్ని చేరుకో...

- **లేవండి !మేల్కొనండి..**
- **స్వామి వివేకానందుడు యువతకు మార్గదర్శి**
- **వివేకానంద - ఒక నవశకం**
- **ఒక సామాజిక వైద్యుడి వివేకవాణి - యువతకు స్ఫూర్తి మంత్రం ధీరనరేంద్రుడు**

**బలగం టీవీ, సిరిసిల్ల**

జాతీయ యవజన దినోత్సవాన్ని ప్రతి ఏడాది జనవరి 12న భారతదేశం వ్యాప్తంగా నిర్వహిస్తారు.ఈ సందర్భంగా స్వామి వివేకానందుడి జయంతి సందర్భంగా ఘనంగా జరుపుకుంటారు. స్వామి వివేకానందుడు యువతకు మార్గదర్శకుడిగా, స్ఫూర్తిదాయకంగా నిలిచిన మహానుభావుడు. ఆయన భావజాలం, సిద్ధాంతాలు, ఉపన్యాసాలు యువతకు ఉత్తేజాన్నిస్తాయి...

**జాతీయ యవజన దినోత్సవం పునాది**

1984లో భారత ప్రభుత్వం జనవరి 12ను జాతీయ యవజన దినోత్సవంగా ప్రకటించింది. ఈ నిర్ణయం ద్వారా యువతలో చైతన్యం నింపడం, వారిని సమాజ నిర్మాణంలో పాల్గొనేలా ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది. 1985 నుండి ఈ రోజును అధికారికంగా జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నారు. మనిషి తన జీవితాన్ని ఆనందంగా గడపడానికి ప్రపంచాన్ని ,సృష్టిని నిరంతరం అన్వేషిస్తూ ఉంటాడు. మనిషి మనుగడ కోసం మరియు మనిషి సుఖంగా జీవించడం కోసం సంబంధించిన వస్తువులను యూరప్ దేశాల వారు కనుగొన్నారు. కానీ, మనిషి శాశ్వతంగా ఆనందంగా గడపడానికి కావలసిన జ్ఞానం ఆసియా ఖండంలో పుట్టింది.

ప్రపంచం చీకటితో నిండిపోయి, అజ్ఞాన అంధకారంలో నెట్టబడిన ప్రతిసారి ఒక యుగపురుషుడు జన్మిస్తాడు. ఆదిశంకరుడు, బుద్ధుడు, జీసస్ క్రైస్ట్, మహావీరుడు ఆ కోవకు చెందినవారే.అత్యంత సంపన్న దేశంగా, సుభిక్షంగా ఉండవలసిన భారతదేశం పరాయి వారి కబంధ హస్తాల కింద నలుగుతున్న కాలం అది. దేశం మొత్తం నిరాశానిస్పృహలతో జీవిస్తున్నారు. ప్రపంచంలో మతం పేరుతో ఒక ఆధిపత్య ధోరణి, అహంకార వైఖరి తో మారణహోమం సృష్టించబడుతున్న సమయం అది. అదిగో! అలాంటి సమయంలో భారతదేశంలో సంక్రాంతి పర్వదినాన కలకత్తా నగరంలో సూర్యుడు సరికొత్త రూపంలో ఉదయించాడు.

భయం ఎరుగని కళ్ళు అవి
తేజస్సుతో కూడిన ముఖం అది
గంభీరమైన గొంతు భలిష్టమైన శరీరం
దేశభక్తి కి నిలువైన రూపం ఆయన
ప్రపంచానికి శాంతి ప్రధాత ఒక స్ఫూర్తి మంత్రం
ఒక ఉప్పెన లాంటి మహా ఋషి
సామాజిక సమరసతకు ఒక పునాది

శంకరుని జ్ఞానం , బుద్ధుని హృదయం రెండు మిలితమైన స్వరూపం అది.

ఆయన బ్రతికింది కేవలం 40 సంవత్సరాలే కానీ ఒక యుగానికి కావాల్సిన సందేశం అందించారు. కొన్ని వేల సంవత్సరాల కి కావలసిన జ్ఞానాన్ని మానవులకు అందించారు. ఆయన మాటలు తరతరాలకు వన్నె తరగని స్ఫూర్తి మంత్రాలు. ప్రపంచంలో అన్ని రకాల సమాజానికి చెందిన వ్యక్తుల్లో నూతనోత్తేజం నింపే ఆణిముత్యాలు. అది భూమిపై అవతరించిన ఓ జ్ఞానకాంతి. అది ఓ ధీరగంభీరం.. ఆ గొంతు నీకేం కావాలో చెబుతుంది. అసలు నీకు నీవెవరో తెలియపరుస్తుంది. నిరాశ, నిస్పృహలతో ఓటమి అంచుల దాకా వెళ్లిన కూడా నీలో వెయ్యి ఏనుగుల బలాన్ని, ధైర్యాన్ని నింపుతుంది. అదే వివేక వాణి. భారతీయతను, భారతదేశ ఔన్నత్యాన్ని, భారతదేశ తత్త్వచింతనను, దేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ఆ ధీశాలి మరెవరో కాదు స్వామి వివేకానంద...

స్వామి వివేకానందుడి జయంతి నేడు (జనవరి 12). ప్రపంచ యవనికపై అత్యంత ప్రభావం చూపిన ఆ మహానుభావుడి పుట్టిన రోజును ఏటా 'జాతీయ యువజన దినోత్సవం'గా నిర్వహించుకుంటున్నాం. అలాంటి మహనీయుని గురించి తెలుసుకొని వారి సందేశాన్ని అనుసరించి జీవితాన్ని చక్కదిద్దుకోవాలని బాధ్యత భారత



యువత ముందున్న కర్తవ్యం.

**స్వామి వివేకానంద జీవిత చరిత్ర ఆదర్శం..**

బాల్యంలో వివేకానంద స్వామిని , నరేంద్రనాథ్ దత్త గా, ముద్దుగా నరేన్ అని పిలిచేవారు వారి తల్లిదండ్రులు భువనేశ్వరీ దేవి , విశ్వనాథ్ దత్త. తన తల్లి చెప్పిన రామాయణం, మహాభారతం కథలు నరేన్ మనస్సు మీద చెరగని ముద్ర వేశాయి. పువ్వు పుట్టగానే పరిమళించినట్లు ప్రశ్నించే తత్వం, ధైర్యము, పేదల పట్ల జాలి, దేశదిమ్మరిగా వచ్చే సన్యాసుల పట్ల ఆకర్షణ మొదలైన గుణాలు నుంచి కనిపించాయి. చిన్నతనంలో ఎవరు ఏది చెప్పినా దాన్ని నిరూపించాలని సవాలు చేసేవాడు.సద్గుణాలతో తను ఒక శక్తివంతమైన యువకునిగా ఎదిగాడు.

యువకునిగా నరేంద్రనాథ్ తన సింహం లాంటి రూపానికి సరితూగే ధైర్యాన్ని కలిగి ఉండేవాడు. మంచి వస్తాదు వంటి శరీరాన్ని, సుస్వర మైన గొంతును, ప్రకాశమానమైన బుద్ధిని కలిగిఉండేవాడు. చదువులోనూ, తత్వశాస్త్రం లోనూ, సంగీతంలోనూ తన తోటి వారి మధ్య తిరుగులేని నాయకుడిగా పేరెన్నికగన్నడు. కళాశాలలో పాశ్చాత్య తత్వాన్ని అధ్యయనం చేసి వంట పట్టించుకున్నాడు. తద్వారా అతని మనసులో విషయాలను సూక్ష్మంగా పరిశీలించే శక్తి నాటుకుపోయింది. పుట్టుకతో అలవడిన లక్షణాలైన అధ్యాత్మికత పై మక్కువ, సనాతన మత సంప్రదాయాల మీద, నమ్మకాల మీద గౌరవం ఒకపక్క, మరొక పక్క పదునైన బుద్ధితో జతగూడిన అతని విమర్శనాత్మక స్వభావం ఇప్పుడు ఒక దానితో ఒకటి తలపడ్డాయి. ఇటువంటి సందిగ్ధ సమయంలో, ఆ కాలంలో బాగా ప్రాచుర్యంలో ఉన్న మత సాంఘిక ఉద్యమమైనా బ్రాహ్మ సమాజంలో చేరి కొంత ఊరట పొందడానికి ప్రయత్నించాడు. బ్రహ్మ సమాజం నిరాకార దైవాన్ని నమ్మి, విగ్రహారాధనను తులనాడీ అనేక విధాలైన సంస్కరణలు చేయడానికి లక్ష్యంగా పెట్టుకుంది. నరేంద్రనాథ్ అనేకమంది పేరెన్నికగన్న మత నాయకులను కలుసుకున్నాడు. కానీ వారెవరూ, ' దేవుడు ఉన్నాడా' లేడా? అన్న అతని ప్రశ్నకు సరైన సమాధానం ఇవ్వలేకపోయారు. ఇది అతని అత్యాధునిక అశాంతిని మరింతగా పెంచింది. 1981లో ఆధునిక భారత దేశపు దివ్యదృష్ట అయిన శ్రీ రామకృష్ణునితో పరిచయం కలిగింది.

తాత్కాలికమైన యాత్రను ప్రారంభించిన 1888 చివరిభాగం నుంచి 1890 లో తన సోదర బృందాన్ని పూర్తిగా విడిచిపెట్టి ఊరు పేరు లేని బైరాగి గా పర్యటించడం ప్రారంభించిన అంతవరకు జరిగిన కాలంలో నరేంద్రుడి దృక్పథంలో గొప్ప మార్పు వచ్చింది. భారతదేశపు జనసామాన్యంలో కలిసి పోవడానికి, ఎవరు తను గుర్తు పట్టకుండా ఉండటానికి రకరకాల పేర్లు పెట్టుకుంటూ ఆయన పర్యటించసాగారు.

**ప్రపంచ వేదిక మీద విజయం**

స్వామి వివేకానందులు చైనా, జపాన్, కెనడాల మీదుగా ప్రయాణించి చికాగో నగరానికి మధ్యభాగంలో చేరుకున్నారు. కాంటన్ లో ఆయన కొన్ని బుద్ధ విగ్రహాలను దర్శించారు. జపాన్ ప్రజల పారిశ్రామిక ప్రగతిని, పరిశుభ్రతను ఎంతగానో మెచ్చుకున్నారు. చికాగో లో ప్రజల కళ్ళు చెదిరే భోగభాగ్యాలను, కొత్త విషయాలను కనిపెట్టే మేధాశక్తిని చూసి ఒక చిన్న పిల్లవాడి లాగా దిగ్భ్రమ చెందారు. విశ్వమత మహాసభ సెప్టెంబర్ వరకు ప్రారంభం కాదని, తగిన పరిచయ పత్రాలు లేనిది ఎవరిని అందులో పాల్గొనడానికి అనుమతించరని తెలుసుకొని నిరాశ చెందారు.

దారి తప్పి పోయినట్టు తోచినా దేవుడి మీద భారం వేసి చికాగో కన్నా చౌకగా ఉండే బోస్టన్ నగరానికి వెళ్ళాడు. తను ప్రయాణించే రైలులో ఆయనకు మిస్ క్యాథరిన్ సాన్ బర్న్ తో పరిచయమైంది. ఆమె తన అతిధిగా వుండమని స్వామీజీని ఆహ్వానించింది. ఆమె ద్వారా స్వామీజీకి హార్వర్డ్ విశ్వవిద్యాలయ అనుచరుడైన జాన్ హెన్రీ రైట్ మహాశయుని తో పరిచయం కలిగింది. సర్వమత మహాసభ అధ్యక్షునికి స్వామీజీని గురించి ఒక పరిచయపత్రాన్ని డా. రైట్ ఇచ్చారు. అందులో ఒక వాక్యంగా, "విద్యాధికులైన మన ఆచార్యులు అందరినీ ఏకం చేసిన దానికన్నా ఎక్కువ జ్ఞానవంతుడైన మనిషి ఇక్కడ ఉన్నాడు" అని వ్రాశాడు.

సర్వమత మహాసభ ప్రారంభానికి ఒకటి రెండు రోజుల ముందు స్వామీజీ చికాగో తిరిగి వచ్చారు. కానీ ఆయన దిగులుకుతోడు, ప్రాచీన మత ప్రతినిధులకు ఆతిథ్యాన్ని అందజేసే కమిటీ చిరునామాను పోగొట్టుకున్నారు. ఆ రాత్రి అక్కడే రైల్వేస్టేషన్లో ఒక పెద్ద పెట్టెలో తలదాచుకుని, మరునాటి ఉదయం తనకు సహాయం చేయగల మనిషి దొరుకుతాయేమోనని బయలుదేరారు. కానీ, శ్వేతజాతీయులు కానివారికి సహాయం అంత త్వరగా లభించదు. నిష్ఫలంగా, చాలాసేపు అన్వేషించిన అలసిపోయి, అంతా దైవసంకల్పం మీద వదిలి రోడ్డు పక్కన చతికిలపడ్డారు. ఆకస్మాత్తుగా ఆయన ఎదురుగా ఉన్న ఇంటిలో ఉన్న ఒక స్త్రీ ఆయన వద్దకు నడిచి వచ్చి ఆయనకు ఏ సహాయం కావాలి అని అడిగారు. ఆమె ఏ శ్రీమతి జార్జి డబ్ల్యూ హెల్. వారి ఇంటి చిరునామా అమెరికాలో స్వామి శాశ్వత విలాసంగా నిలిచిపోయింది. హెల్ కుటుంబీకులు స్వామి భక్తుడిగా మారిపోయారు.

సర్వమత మహాసభ 1893 సెప్టెంబర్ 11 వ తేదీన ప్రారంభమైంది. కళాసంస్థ (ఆర్ట్ ఇన్స్టిట్యూట్) సభా ప్రాంగణం సుమారు ఏడు వేలమంది జనంతో కిటకిటలాడిపోయింది. వారు ఆ దేశపు ఉత్కంఠ సంస్కృతికి ప్రతినిధులు. వేదిక మీద ప్రపంచం నలుమూలల నుంచి విచ్చేసిన అన్ని మతాల ప్రతినిధులు ఆశీనులయ్యారు. స్వామీజీ అటువంటి బ్రహ్మాండమైన, విశ్వవిఖ్యాత లైన వారితో నిండిన సభను ఉద్దేశించి ప్రసంగించలేదు. ఆయన చాలా భయపడ్డారు. ఆయన తరుణం వచ్చినప్పుడు, మనసులో సరస్వతీదేవికి నమస్కరించి," అమెరికా దేశపు సోదర సోదరీమణులారా!" అని సంబోధించారు. వెనువెంటనే ఆ బ్రహ్మాండమైన సభలో కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి. పూర్తిగా రెండు నిమిషాలపాటు ఆ కరతాళాలు ఆగలేదు." ఏడు వేలమంది జనం లేచి నిలబడి తమకు అంతుబట్టని ఏదో ఒక దానికి నివాళులర్పించారు. ప్రజ్వరిల్లే చిత్తశుద్ధితో ఆయన పలికిన పలుకులు, తేజస్సుతో నిండిన ఆయన ముఖ వర్చస్సు, కాషాయ వస్త్రాలు వారిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. మరుసటిరోజు వార్తాపత్రికల స్వామీజీని సర్వమత మహాసభ లో పాల్గొన్న ప్రతినిధులలో అత్యుత్తముడిగా గా కీర్తించాయి. బిక్ష పాత్రతో బయలుదేరిన ఒక సాధారణ సాధువు అందరి మనసులనూ దోచుకున్న వాడిగా ఎదిగిపోయాడు.

స్వామీజీ అటుపై ఆ మహాసభలో చేసిన ప్రసంగాలు అన్నిటినీ సభికులు గొప్ప గౌరవంతోనూ, ఆసక్తితోనే విన్నారు. అన్నిటిలోనూ విషయము సార్వజనానితే ! సభలో మిగిలిన ప్రతినిధులు తమ తమ గొప్పదనం గురించి మాట్లాడితే స్వామీజీ, ఆకాశమంత విశాలమైనది, సముద్రమంత లోతైనది అయన మతాన్ని గురించి మాట్లాడారు. మహాసభ ముగియడంతో స్వామీజీ అనామక జీవితం ముగిసిపోయింది.

**విజయుడై తిరిగి భారతదేశానికి**

వివేకానంద స్వామి సేవియర్ దంపతులతో కలిసి 1896 డిసెంబర్ 16వ తేదీన లండన్ నగరాన్ని వదిలి బయలుదేరారు. తదితర దేశాలను సందర్శించిన తరువాత డిసెంబర్ 30న నేపుల్స్ లో భారతదేశానికి వెళ్ళే ఓడను ఎక్కారు. నేపుల్స్ లో జె.జె.గుడ్విన్ వారితో కలిశాడు. 1897 జనవరి 15న కొలంబో చేరుకున్నారు. స్వామీజీ వస్తున్నారన్న వార్త అప్పుడే పాకిపోయింది. ఆహ్వానించాలని ఆతృతతో ఎదురు చూడసాగారు.ఆయన ఇప్పుడు ఒక "అనామక సన్యాసి" ఎంతమాత్రం కాదు.ప్రతి చిన్నా పెద్దా పట్టణంలోనూ ఆయన విజయానికి తగిన ఎదుర్కోలు పలకడానికి ఆహ్వాన సంఘాలు ఏర్పాటయ్యాయి. రోమారోల ఇలా వర్ణించారు: "అత్యుత్సహంతో ఎదురు తెన్నులు చూస్తున్న జనభాహుల్యానికి తన 'భారతదేశానికి సందేశంతో, రాముడు,కృష్ణుడు,శివుడు పుట్టినగడ్డను పునరుజ్జీవింపజేసే శంఖారావంతో,ఆ జనులు ధీరశక్తినీ, అమర ఆత్మశక్తినీ ఎలుగెత్తి పిలుస్తూ, యుద్ధరంగానికి కదనుత్రొక్కమన్నారు.ఆయన ఒక సేనాధిపతి. తన 'ఉద్యమ ప్రణాళికను' వివరించి తన దేశ ప్రజలను ఒక్కుమడిగా లేచిరమ్మని పిలుస్తూ, ' ఓ,నా భారత దేశమా! నీ ప్రాణశక్తి ఎక్కడుందో తెలుసా? మరణ మెరుగని నీ " లోనే"! అని ఉద్బోధించారు. మద్రాసులో ఆయన ఐదు ఉపన్యాసాలను ఇచ్చారు. బలహీనతలనూ, పిచ్చి నమ్మకాలనూ పారద్రోలి ఒక కొత్త భారతాన్ని నిర్మించమని బోధించే తూర్యనాదాలు అవి. " ఏ దేశ జాతీయజీవన సంగీతానికంతటికీ మతమే జీవస్వరమని " ఆయన బోధించారు. ఆ మతం, ఈ విశ్వమంతా ఆ ఆత్మ స్వరూపమే' అని బోధిస్తున్నదనీ ఆ మతాన్ని బలోపేతం చేస్తే, మిగిలినవన్నీ వాటికవే చక్కబడతాయనీ బోధించారు. అయితే తన దేశప్రజల బలహీనతలను ఆయన విమర్శించకుండా ఉండలేదు. ప్రజలు గుడ్డిగా పాశ్చాత్య పద్ధతులను అనుకరించడానికి, పాత కాలపు పిచ్చిపిచ్చి నమ్మకాలని, కుల విభేదాలను ఆయన తూర్పారబట్టారు.

**విశ్వమే నా దేశం**

సత్యమే నా దైవం.. విశ్వమే నా దేశం అని ప్రకటించుకున్నారు వివేకానంద. నేను భారతదేశానికి ఎంత చెందుతానో, ప్రపంచానికి కూడా అంతే చెందుతానని స్పష్టం చేశారు. చెప్పినట్టే తన జ్ఞానసంపదను, ఆధ్యాత్మిక చింతనను విశ్వవ్యాప్తం చేశారు. ప్రాక్పశ్చిమ దేశాల్లో వేదాంత భేరిని మోగించిన వివేకానందుడి ప్రతి మాట, సందేశం.. ప్రపంచ యవనికపై అత్యంత ప్రభావితం చూపాయి.

**కష్టాల్లో ఉన్నప్పుడే మన శక్తియుక్తులు**

కష్టాల్లో ఉన్నప్పుడే మన శక్తియుక్తులు బయటపడతాయని వివేకానందుడు చెప్పారు. అద్భుతాలు సాధించడానికి మూలం మన నమ్మకమేనని అన్నారు. ఏ పరిస్థితుల్లో ఉన్నా.. నీ కర్తవ్యం నీకు గుర్తుంటే జరగాల్సిన పనులు అవే జరుగుతాయని ఆయన చెప్పారు. నిజాయతీగా పనిచేసు కుంటూ పోతే ప్రపంచమంతా ఏకమై నీకు సహకరిస్తుందని బోధించారు. 'అపారమైన విశ్వాసం, అనంతమైన శక్తి.. ఇవే మీ విజయసాధనకు మార్గాలు' అని వివేకానందుడు చెప్పారు. ఎవరిపైనో భారం వేయకుండా మన శక్తియుక్తులను నమ్ముకోవడమే విజయతీరానికి మార్గం. యువత, విద్యార్థులు, క్రీడాకారులు, సైనికులు, ఉద్యోగులు అందరికీ వర్తించే సూత్రమిది.

**మనం ఆయనకు ఇచ్చే ఘన నివాళి..**

భారతీయ ఆధ్యాత్మికతను పునరుజ్జీవింపచేయడంలో, యువశక్తిని చైతన్యపరచడంలో వివేకానందుడి కృషి అమూల్యం, అనితరసాధ్యం. ఆయన సూక్తులు నిత్యం ఎంతో మందిలో స్ఫూర్తి నింపుతున్నాయి. భవిష్యత్తులోనూ నింపుతాయి. ఆ మాటకొస్తే ఈ భూగోళం ఉన్నంతవరకూ ప్రతి ఒక్కరిలో ఏదో రూపంలో ఆయన స్ఫూర్తి నింపుతూనే ఉంటారు. కులాలు, మతాలు, వర్గాలుగా విడిపోయి కొట్టుకుంటున్న నేటి సమాజం వివేకానందుడి సూక్తులతో మరోసారి జాగృతం కావాలి. భారతీయతత్త్వం, మన సనాతన ధర్మం మరోసారి దేదీప్యమానంగా వెలగాలి. ఆ స్ఫూర్తిమంత్రం ప్రపంచానికి కొత్త దారిని చూపాలి. అదే ఆయనకు మనమిచ్చే ఘన నివాళి..



డా. జి. సురేంద్ర బాబు
ప్రధాన కార్యదర్శి
నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్
ఎంబిబిఎస్ ,ఎండి పిడియాట్రిక్స్
అమృత చిల్డ్రన్స్ హాస్పిటల్,సిరిసిల్ల
మేనేజింగ్ డైరెక్టర్ : జయవారాహి హాస్పిటల్స్
నరేన్ ఫౌండేష్ వ్యవస్థాపకులు.
8728081999